

పేదల వైద్యానికి భరోసా

- ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఉచిత వైద్యం
- డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఈ ఏడాది 1,60,593 మందికి వైద్య చికిత్సలు
- రూ.317 కోట్ల బిల్లులు చెల్లింపు



పేదల ఉచిత వైద్యం పట్ల వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. కూటమి సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, మెడికల్ కళాశాలలు పీపీపీ కింద ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ ప్రజలను మసిపూసి మారేడు కాయ చేసే ఎత్తులకు దిగారు. ప్రజల్లో గందరగోళ పరిస్థితులను క్రియేట్ చేస్తున్నారు. కానీ జిల్లాలో పేదల వైద్యానికి సంబంధించి కూటమి సర్కారు వచ్చిన నాటి నుంచి ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోంది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల కింద ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యసేవలందేలా చంద్రబాబు సర్కారు చర్యలు చేపట్టడంతో పేదవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధులు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు సీఎంతో పాటు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్యశాఖను అప్రమత్తం చేస్తున్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల కింద ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. రాజీలేకుండా నెట్‌వర్క్, కార్పొరేట్ ఆసుపత్రులకు వెనకో, ముందో బిల్లులు చెల్లింపులు చేస్తున్నారు. ఇకపోతే చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటికి వేల కోట్ల పెండింగ్ బిల్లులు, కార్పొరేట్ ఆసుపత్రుల నిరసనలు, సేవలందించమనే డెడ్‌లైన్ పెట్టేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల వైద్యాన్ని ఎక్కడా ఇబ్బంది పెట్టలేదంటారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తూనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3250 వ్యాధులకు సంబంధించి 1,60,593 మంది పేదలకు వైద్య సేవలు, సర్జరీలు జరిగాయి. ఈ చికిత్సల మొత్తానికి రూ.317 కోట్లు చెల్లింపులు చేయడం గమనార్హం. కాగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రభుత్వం ఎంప్లాయీస్ హెల్త్‌కార్డుల జారీలో నాటి, నేటి ప్రభుత్వాలు మీనవేషాలు వేస్తున్నాయనే విమర్శలున్నాయి.

రూ.317 కోట్లతో 1,60,593 మందికి చికిత్సలు

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చే నాటికి గత వైసీపీ ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలు, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉంది. ఎన్నికల హామీలు అమలు చేసే విషయంలో కొంత ఆటుపోట్లను ఎదుర్కోవాల్సిన సమయంలో సీఎం చంద్రబాబు సూచనల మేరకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేదల ఉచిత వైద్యం పట్ల ఎక్కడా ఇబ్బందులు జరగకూడదని ముందుకెళ్లడంతో పేదల వైద్యానికి జిల్లాలోనే కాక రాష్ట్రంలో ఇబ్బందులు రాలేదంటారు. ఒక పక్క గత వైసీపీలో పాత పెండింగ్ బిల్లులు చెల్లించక పోవడంతో నెట్‌వర్క్, కార్పొరేట్ ఆసుపత్రుల నిరసనలు, నిలిపివేస్తామని డెడ్‌లైన్‌లను చక్కబెట్టి పేదలకు ఎన్టీఆర్ వైద్య సేవలను విస్తృతం చేశారు.

4 లక్షల కుటుంబాలకు ఎన్టీఆర్ హెల్త్‌కార్డులు

జిల్లాలో పేదలకు ఉచిత వైద్య సేవలందించేందుకు ప్రామాణికంగా భావించే డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల హెల్త్‌కార్డులు 4 లక్షల కుటుంబాలకు ఉన్నాయి. కొత్తకార్డుల జారీకి ప్రభుత్వం ఇంకా అనుమతులు జారీకానందున పేదలు కొందరు హెల్త్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. కానీ కూటమి సర్కారులో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల కోసం వచ్చే ప్రతి ఒక్కరికీ వైద్య చికిత్సలు అందించే విషయంలో ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రభుత్వం గుర్తించిన వ్యాధులకు మాత్రమే కాకుండా జాబితాలోని క్యాన్సర్, కీమోథెరపీ లాంటి ఖరీదైన చికిత్సలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ వైద్య సేవలందించే పనిలో పడ్డారు. ఇప్పటికే తెలంగాణ, చెన్నై, కర్ణాటక రాష్ట్రాలలో ఎన్టీఆర్ వైద్యసేవల కింద గుండె ఆపరేషన్లు, కార్డియాలజీ లాంటి ఖరీదైన సర్జరీలు నిర్వహిస్తున్నారు.

ఎటువంటి ఫిర్యాదు రాలేదు



జిల్లాలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా వైద్య సేవలందలేదని, పేదల నుంచి ఎక్కడా ఫిర్యాదు అందలేదు. ఒకవేళ వైద్య చికిత్సలు అందించే విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరిస్తున్నాం. ఎన్టీఆర్ వైద్య సేవలు నెట్‌వర్క్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో యథావిధిగా సాగుతున్నాయి. 3 నెలల కిందట బిల్లులు చెల్లించలేదని 6 ఆసుపత్రులు ఓపీ చూడలేదు. అయితే ఇన్‌పేషంట్లకు, సర్జరీలు, ఇతర వైద్య చికిత్సలు నిరాటంకంగా జరుగుతున్నాయి. ఎన్టీఆర్ హెల్త్‌కార్డులు లేకున్నా, పేదల వైద్యానికీ సీఎంసీఓ నుంచి అనుమతులు ఇప్పిస్తూ వైద్య సేవలు అందిస్తున్నాం.

- డాక్టర్ బాలాంజనేయులు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా కో ఆర్డినేటర్

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధితులు తమ సమస్యలతో కూడిన అర్జీలు సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. అలాగే సోమవారం ఉదయం 9-30 గంటలకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

విశ్వబ్రాహ్మణులు కలిసికట్టుగా ఉండాలి

- విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పార్వతమ్మ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్టంలోని విశ్వబ్రాహ్మణు లంతా కలిసికట్టుగా ఉన్నప్పుడే ఏదైనా సాధించుకోవచ్చని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం మండల కేంద్రంలోని విరాట్ భవన్‌లో ఆ సంఘ అధ్యక్షుడు హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కమ్మరి పార్వతమ్మ, తెలంగాణ ఏసీపీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, కోశాధికారి ధనుంజయాచారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ ఈ నెల 17న అన్ని జిల్లాలు, మండలాల్లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు జరిగాయన్నారు. ప్రత్యేకంగా భగవాన్ విశ్వకర్మ వంద అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేసేందుకు సీఎంకు నివేదించినట్లు తెలిపారు. అలాగే విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ తమ శాయశక్తులా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం తెలంగాణ అసిస్టెంటు పోలీసు కమిషనరు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో తమ సంఘం మరింతగా అభివృద్ధి చెందాలంటే ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో ఈ.వెంకటాచారి, డాక్టర్ నాగార్జున, విశ్వబ్రాహ్మణ డైరెక్టర్లు పద్మావతి, శేషగిరిరావు, నాగాచార్యులు, శ్రీనివాసచార్యులు, రంగాచారి, వెంకటేశ్వర్లు, సుశీలమ్మ, వాసవీ, లక్కోజు సుజాతతో పాటు న్యాయవాది గురుప్రసాద్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మానాన్న లేరు..

- అనాథలైన చిన్నారులు
- 105 రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన పసిబిడ్డలు

(వివరాలు.. 7లో)


జిల్లా ఆసుపత్రిలో దోపిడీ

- సొంత ల్యాబ్‌లకు టెస్టులు రెఫర్
- ఫార్మసీ నుంచి పరికరాలు చోరీ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- అక్రమార్జనే ధ్యేయంగా వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరు
- విచారిస్తే అక్రమాలు వెలుగులోకి






బ్లడ్ శాంపిల్స్ తీసుకొని దర్జాగా వెళుతున్న ప్రైవేటు వ్యక్తి



ఓపీ చీటి వెనుక రక్త పరీక్షలు రాసిన వైద్యులు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అవినీతి అక్రమాలకు నెలవుగా మారింది. నిత్యం వందలాదిగా రోగులు ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తుంటారు. ఆసుపత్రిలో ఓపీ దగ్గర నుంచి రక్త పరీక్షలు, ఎక్స్‌రే, సిటీ స్కానింగ్ లాంటి అన్ని వైద్య పరీక్షలు రోగులకు ఉచితంగా చేసి మందులు అందజేయాలి. వార్డులో ఇన్‌పేషంట్‌గా చేరిన వారికి కూడా ఉచితంగా వైద్యసేవలందించాలి. కానీ వార్డుల్లో పనిచేసే కొందరు ఏఎన్ఎంలు, ఎఫ్ఎన్‌వోలు, స్వీపర్లు డబ్బుల కోసం రాబందుల్లా పేషంట్లను పీక్కుతింటున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే కొందరు మెడికల్ ల్యాబ్‌లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వైద్యులు రాసే రక్తపరీక్షలు ఇక్కడ లేవని చెప్పి బయట వున్న ప్రైవేటు ల్యాబ్‌లకు పేషంట్లను పంపి కమీషన్లు దండుకుంటున్నారు. ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ (ఐపీహెచ్ఎల్) ల్యాబ్‌లో పనిచేసే పరమేశ్వరుడి పేరుతో ఉన్న టెక్నీషియన్, మరో పెథాలజిస్టు వైద్యుడు కలిసి గాంధీ రోడ్డులోని పోసిన కాంపౌండ్‌లో ప్రైవేటు ల్యాబ్ నడుపుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉండే వ్యక్తి శాంపిల్స్‌ను ఆసుపత్రి మూడవ గేటు గుండా తన ల్యాబ్‌కు తరలించి రక్త పరీక్షలు చేయిస్తున్నాడనే ఆరోపణలు వున్నాయి. జేఎస్ఎస్‌కె నుంచి వచ్చిన పీటీఐఎస్ఆర్ శ్యాంపిల్స్‌ను టెస్టులు చేయకుండానే రిజల్ట్ రాసేస్తున్నారనే ఆరోపణలు బలంగా వున్నాయి. అంతేకాకుండా ఫార్మసీ నుంచి ల్యాబ్‌లకు ఇచ్చే పరికరాలను ముఖ్యంగా గ్లౌజులు, స్లైడులు, 10 సీసీసీ రంజులు లైస్‌మెన్స్‌టైన్, యూరిన్ కంటైనర్, యూరిన్ అనాలసిస్ ట్రిప్స్ స్పిరిట్ బాటిల్స్ కాటన్‌తో సహా అన్ని వస్తువులను ప్రైవేటు ల్యాబ్‌లకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకంగా అన్నిరకాల రక్త పరీక్షలకు అవసరమైన పరికరాలతో అతి పెద్ద ల్యాబ్ ఉన్నా ఇక్కడి సిబ్బంది పరీక్షలు చేయకుండా కమీషన్ల కోసం బయటి ల్యాబ్‌లకు పంపుతున్నారు. అంతేకాకుండా రక్త పరీక్షలు చేసే మిషన్లను (థైరాయిడ్ టెస్టింగ్ మిషన్) ఉద్దేశ్యంగా చెడగొట్టి వాటిని నెలల తరబడి బాగుచేయకుండా చెడిపోయాయనే సాకు చెప్పి ప్రైవేటు ల్యాబ్‌లకు టెస్టులు పంపుతున్నారని రోగులు చెబుతున్నారు. ఇందులో ఆసుపత్రికి చెందిన ఓ పెథాలజిస్టుతో పాటు బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జ్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ల్యాబ్ ఇన్‌చార్జిగా ఉన్న వైద్యుడే ఈ దందాకు సూత్రధారిగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం ఉంది. వైద్యులు, టెక్నీషియన్లు కుమ్మక్కై నిరాటంకంగా ఈ అక్రమాలు సాగిస్తున్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అధికారులుగా పనిచేసిన వారందరూ సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో ఈ దందా చాలాకాలంగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. ఇప్పటికైనా జిల్లా ఆసుపత్రిలోని మెడికల్ ల్యాబ్‌లో జరిగే అక్రమాలపై టెక్నీషియన్ల అవినీతిపై డీసీహెచ్ఎస్ అధికారితో పాటు వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఈ విషయంపై జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ రూపానంద్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

బాల త్రిపురసుందరీదేవి.. నమోస్తుతే



కడప అమ్మవారిశాలలో గాయత్రిదేవి అలంకారం





కడప అమ్మవారిశాలలో కిటకిటలాడుతున్న భక్తులు

విజయదుర్గాదేవి ఆలయంలో కాళరాత్రిదేవి అలంకారం



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో బాల త్రిపురసుందరీదేవి

కడప కల్చరల్/ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు అమ్మవారి ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారిశాలవీధిలోని కన్యకాపరమేశ్వరి, శివాలయం, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇక కడప అమ్మవారిశాలవీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో, విజయదుర్గాదేవి ఆలయంలో కాళరాత్రిదేవి, లలితా పంచాయన దేవాలయంలో మహాలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. దేవునికడప లక్ష్మీవెంకటేశ్వరుని ఆలయంలో తిరుమలేశుడు గరుడ వాహనంపై ఊరేగారు.




ప్రొద్దుటూరు చెన్నకేశవస్వామి ఆలయంలో మహాలక్ష్మి అలంకారం



అమ్మవారికి కళశాలలో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం





ప్రొద్దుటూరు శివాలయం, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో బాల త్రిపురసుందరీగా అమ్మవారి దర్శనం

నిరంతర నిఘా ఉంచాం : డీఎస్పీ

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలో నిరంతర నిఘా వుంచామని డీఎస్పీ భావన పేర్కొన్నారు. పట్టణంలో విజయదశమి రోజు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో బందోబస్తు పర్యవేక్షణ చేపడతామని, ఎగ్జిబిషన్‌లో కూడా ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆకతాయి చేష్టల కట్టడికి శక్తి టీంల పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు రోజు వచ్చే లక్షలాది మంది భక్తులకు తొక్కిసలాట జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే డయల్ 100, 101, 102, 112 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈమె వెంట సీఐలు, ఎస్ఐలు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఉన్నారు.

ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలి

కడపసెవెన్ రోడ్స్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు.

జగజ్జననీ..లోకపావని...

కడప కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాకు ఆధ్యాత్మిక శోభ తెచ్చాయి. జిల్లాలోని ప్రతి ఆలయం దీపకాంతు లతో అలరారుతోంది. భారీ సెట్టింగులు, అలంకారా లతో భక్తులను విశేషంగా ఆకర్షిస్తు న్నాయి. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఆల యాలు భక్తులతో పోటెత్తారు.

అమ్మవారిశాలలో..: అమ్మవారిశాలవీధిలో వెలసి న కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

రాజరాజేశ్వరి ఆలయంలో..: రాజరాజేశ్వరిదేవి ఆల యంలో అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

లలితా పంచాయతన దేవాలయంలో..: నగర శివారు ప్రాంత లలితాపంచాయతన దేవాలయం లో అమ్మ వారు మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

విజయదుర్గాదేవి ఆలయంలో..: బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాళరాత్రి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో చిన్నారుల కోలాటం భక్తులను ఆకట్టుకుందని ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జునరావు, ఆలయ నిర్వాహకుడు దుర్గా ప్రసాద్ వెల్లడించారు.

గడ్డిబజారు బాలాజీ ఆలయంలో..: గడ్డిబజారు లో వెలసిన లక్ష్మీ సత్యనారాయణస్వామి దేవ స్థానం (బాలాజీ)లో అమ్మవారు లక్ష్మీ నారాయణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజారెడ్డివీధిలో..: రాజారెడ్డివీధిలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.

సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన కామకోటి కళాంబదేవి సమేత సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎర్రముక్కపల్లెలో...: ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఎస్‌బీఐ సమీపంలో వెలసిన అమ్మవారి ఆలయం లో మహా లక్ష్మిగా, సీయోనుపురం (రాజారెడ్డివీధి) లో వెల సిన శక్తిసవారమ్మఅవ్వ దేవస్థానంలో అమ్మవారు గౌరీదేవిగా చిన్నబెస్త వీధిలో వెలసిన బాల పోలేరమ్మ దేవస్థానం లో అమ్మ వారు బాలపోలేరమ్మ దేవిగా, హనుమప్ప వీధిలో వెలసిన భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

కమలాపురం రూరల్..: పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిదేవీ వారాహి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చి భక్తులను కను విందు చేశారు. పెద్దచెప్పలి అమ్మవారిశాలలో అన్న పూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

వీరపునాయునిపల్లె..: అనిమెల గ్రామ సమీపంలో ఉన్నసంగమేశ్వర ఆలయంలో మహాశక్తిదేవి అలంకరణ లో పార్వతీదేవి అమ్మ వారు దర్శనమిచ్చారు.

సీకేదిన్నె..: కొత్తపేట గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

చెన్నూరు..: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామలింగచౌడేశ్వరి ఆలయంలో భవానీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా ఆలయంలో అమ్మవారు శారదాదేవిగా దర్శనమిచ్చారు.

పెండ్లిమర్రి..: పొలతల మల్లికార్జున స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు.

లింగాల..: లింగాల గ్రామంలో పెద్దమ్మ తల్లికి మహిళలు దసరా పురస్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 101 బిందెలు నీటిని పోసి, బోనాలు సమర్పించి పూజలు చేశారు.


విజయదుర్గా ఆలయంలో అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న మహిళలు


కడప..ఎర్రముక్కపల్లెలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు


వీఎన్‌పల్లె... మహాశక్తి అలంకరణలో పార్వతీదేవి, సీకేదిన్నె..మహాచండీదేవిగా గంగమ్మ అమ్మవారు


చెన్నూరు చౌడేశ్వరి ఆలయంలో భవానీ దేవి అలంకారం


పొలతలలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు, కడప..రాజరాజేశ్వరిదేవి ఆలయంలో బాల త్రిపురసుందరీదేవి, చిన్నబెస్తవీధిగంగమ్మ తల్లి ఆలయంలో బాలపోలేరమ్మ అలంకారం, సౌమ్యనాథేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకారం, భద్రావతి భావనారుషి ఆలయంలో లలితాదేవి అలంకారం


లింగాలలో బిందెలతో నీరుపోస్తున్న మహిళలు

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి

చక్రాయపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులు రాబోయే 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ సోషల్ వెల్ఫేర్ అధికారి అంజలిదేవి పేర్కొన్నారు. ఆదివారం గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని దర్శించుకొని అనంతరం పలు హాస్టళ్లను పరిశీ లించారు.

'హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు'

బీజేపీ

వేంపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల టీటీడీపై చేసిన వ్యాఖ్యలు శోచనీయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ తెలిపారు. వేంపల్లెలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రమైన టీటీడీ దళితవాడల్లో ఆలయాలను నిర్మిస్తామంటే షర్మిల వద్దని చెప్పడంలో అర్థం లేదన్నారు. టీటీడీపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహ రించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్థికంగా బలపడితేనే పురోగతి

కడప కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడితేనే దేశ పురోగతి సాధ్యపడుతుందని జమాఅతే ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అక్బర్‌బాష పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జమాఅతే ఇస్లామీ హింద్ నగర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19 నుంచి నవంబరు 30 వరకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుతో జరుగుతున్న వక్ఫ్ సవరణ చట్టం-2025 వ్యతిరేకంగా దేశవ్యాపిత ఉద్యమానికి ముస్లిం సంస్థలు మద్దతు ప్రకటించాయన్నారు. సమావేశంలో జమాఅతే ఇస్లామీ హింద్ నగర అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

కడప క్రైం సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలో కడప ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ ఆదివారం నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్.ఐ జయరాములు సిబ్బందితో ముమ్మరంగా డ్రైవర్లను బ్రీత్ అనలైసర్‌తో తనిఖీలు చేశారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం లో భాగంగా బ్రీత్ అనలైజర్ తో హైవే పై వాహనదారులకు తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ జయరాములు హెచ్చ రించారు.

కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష విమర్శించారు. శాసనసభలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు జుగుప్సాకరమని మండిపడ్డారు. ఆదివారం కడప నగరం మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను అంజాద్‌బాషతో పాటు ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్యాయానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

షామీర్య, లా కళాశాల బ్రిడ్జి నిర్మాణం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):కడప నగరంలో రూ.20కోట్ల వ్యయంతో షామీర్య, లా కళాశాల బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కడపలోని పాతబస్టాండ్ వద్ద షామిర్యా, లా కళాశాల బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరణ, భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి రెండు బ్రిడ్జిలకు శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుతో అక్రమాలకు అడ్డుకట్ట

ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి


రేషను కార్డు పంపణీ చేస్తున్న పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్త స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు అడ్డుకట్ట పడినట్లేనని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డితెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామంలో స్మార్టరేషన్ కార్డుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ముందుగా చెప్పలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్యుల ఆహ్వానం మేరకు అమ్మవారిశాలకు వెళ్లి దుర్గమ్మ తల్లికి పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శివరాంరెడ్డి, ఆర్ఐ నజీర్‌బాషా, ఇన్‌ఛార్జ్ సర్పంచ్ రుక్మిణమ్మ పాల్గొన్నారు

చెన్నూరు..: సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అందరికీ సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. చెన్నూరు మైనార్టీ కాలనీలో స్మార్ట్‌కార్డులు పంపిణీని ఆదివారం రాత్రి చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మైనార్టీ నేతలు షబ్బీర్‌హుస్సేన్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గౌస్‌పీర్, నేతలు మంజూరు అహ్మద్, సుభాని, కరీం, జిలానీ, రంతుల్లా, శ్రీలక్ష్మి, రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనం ఆనందకరం..: దసరా ఉత్సవాల్లో రామలింగ చౌడేశ్వరీని దర్శించుకోవడం ఎంతో ఆనంద కరమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. దసరాఉత్సవాల్లో భాగంగా రామలింగ చౌడేశ్వరిదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరిని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటసుబ్బయ్య, నీటిసంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాసులు, ఆటోబాబు, గుగ్గిళ్ల చాణక్య, ఆకుల ప్రసాద్, గుమ్మళ్ల మల్లికార్జునరెడ్డి, ఇందిరెడ్డి శివారెడ్డి, పెద్దసుబ్బారెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, సుదర్శనరెడ్డి,మురళి, వేల్పుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆశాలకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా అక్టోబరు 7 నుంచి ఆశాలు ఉద్యమబాట పట్టడం తథ్యమన్నారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, జనరల్ సెక్రటరీ కేసీబాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించండి

పులివెందుల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఇస్కాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని తిరుపతి ఇస్కాన్ టెంపుల్ ప్రధాన అర్చకుడు గోవర్దన్ విహారి దాస్ కోరారు. జనసేన పులివెందుల ఇన్‌చార్జి హరీష్‌తో కలిసి గోవర్దన్ విహారిదాస్ ఆదివారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిశారు. అలాగే తుంగభద్ర ప్రాజక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, వేంపల్లె పరిశీలకుడు రఘునాథరెడ్డిలను కలిసి పులివెందులలో ఆలయ నిర్మాణ విషయంపై మాట్లాడారు.

నేడు స్మార్ట్ కార్డుల పంపిణీ

పెండ్లిమర్రి, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి):మండల పరిధిలోని చీమలపెంట గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డుల పంపిణీ ఉంటుందని మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు.కార్యకర్తలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

అపూర్వం.. పూర్వవిద్యార్థుల కలయిక

చెన్నూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో పూర్వ రోజుల్లో చదువుకున్న జ్ఞాపకాలు, తీపి గుర్తులు వారిని నేటికీ వీడలేదు. చాలా ఏళ్లతరువాత మరొక మారు గత తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ అందరినీ కలుపుకుని ఆనందాన్ని పంచుకోవాలని ఆ విద్యార్థులు తాము చదివిన చెన్నూరు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఒక్కటయ్యారు. ఆదివారం ఉదయం అప్పటి గురువులను పిలిపించి ఘన సన్మానం చేశారు. 1981-82 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

తాము చదివిన పాఠశాలే వేదికగా చేసుకుని విద్యాబుద్ధులు నేర్పించి తమ ఉన్నతి కారణమైన ఉపాధ్యాయుల ను సన్మానించారు. గురువులు అందరూ రాక పోయినా వచ్చిన నారాయణరెడ్డి, శేషగిరిరావు, ఈశ్వర్‌రెడ్డి, సుబ్బలక్ష్మిని శాలువా కప్పి పూలమాల వేసి పాదాభివందనాలు చేశారు.


చెన్నూరులో 1981-82లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల కలయిక

అమ్మానాన్న లేరు..

● అనాథలైన చిన్నారులు



అనాథలుగా మారిన చిన్నారులు లక్ష్మి, యశ్వంత్

దువ్వూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆలన, నాన్న పాలనలో పెరగాల్సిన చిన్నారులు ఆ అదృష్టానికి దూరమయ్యారు. బ్రతుకు బండి ఎలా లాగాలో, బ్రతుకుదెరువు ఏమిటో తెలియని అన్నాచెల్లెలుకు కన్నతల్లిదండ్రులు మరణించడంతో పలువురిని కలచివేస్తోంది. 105రోజుల వ్యవధిలో మొదట తల్లి, ఈనెల 28న శనివారం తండ్రి మరణంతో ఏడేళ్ల యశ్వంత్, ఆరేళ్ల లక్ష్మి అనాథలయ్యారు.

దువ్వూరు గ్రామానికి చెందిన నరసింహులు (30) కామెర్ల వ్యాధితో బాధపడున్నాడు. దీంతోపాటు శనివారం పిట్స్ కూడా రావడంతో అకస్మాత్తుగా మృతి చెందాడు. ఇదే సంవత్సరం జూన్ నెల మధ్యలో చిన్నారుల కన్నతల్లి గంగాభవానీ (26) అనారోగ్య కారణంగా మృత్యువాత పడింది. తల్లి మరణించిన 105 రోజులకే తండ్రి కూడా మృతి చెందడంతో చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం తాత బాలరంగడు ఈ బిడ్డలకు జీవనాధారమయ్యాడు. ఈ సంఘటన చుట్టుపక్కలవారిని కంటతడిపెట్టిస్తోంది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి చిన్నారులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● చిన్నారులకు తీవ్ర గాయాలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట సమీపంలోని ఇరుకురాళ్ల బోటు వద్ద స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇరువురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. కడపలోని రవీంద్రనగర్‌కు చెందిన పట్నం ఆదిలక్షుమ్మ(65) తన మనవడు సాయికిరణ్, మనవరాలితో కలిసి ఆదివారం ఉదయం 11గంటలకు నందలూరు నుంచి కడపకు స్కూటీలో బయలుదేరారు. ఇరుకురాళ్ల బోటు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో వీరిని కడప రిమ్స్‌కు తరలించగా ఆదిలక్షుమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కడప క్రైం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కడప నగరం రైల్వేస్టేషన్ గూడ్స్ గోడలు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తి వయస్సు 40-45సంవత్సరాల మధ్య ఉంటుందని, గూడ్సు గోడల వద్ద ఉండేవాడని, అయితే అనారోగ్య కారణంగా మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ గుర్తించినవారు 9121100510, 9121100511 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు కథనం మేరకు... ముష్టూరుకు చెందిన ఖాసీమ్ తన ఆటోలో ప్రయాణికులను మదనపల్లికి తరలిస్తుండగా రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లీలాప్రియదర్శిని, ప్రియాంక, చెంద్రాయుడు, హరిత, మరొకరు గాయపడ్డారు. గాయపడిన వారిని మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కట్టా పుట్టాలమ్మ ఆలయంలో చోరీ

ఓబులవారిపల్లె/రైల్వేకోడూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో ఉన్న కట్టా పుట్టాలమ్మ దేవాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం పోలీసులకు సమాచారమిచ్చారు. రైల్వేకోడూరు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయంలో ఉన్న బీరువాలను పగులగొట్టి అందులో ఉన్న నగదును, పలు వస్తువులను దొంగలు అపహరించుకుని వెళ్లినట్లు ఎస్ఐ వివరించారు. ఈ మేరకు విచారిస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం



ఎర్రగుంట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తికి చెందిన బెస్తల అమరావతి(68) కనిపించకుండా పోయినట్లు పోలీసులు తెలిపారు. అమరావతికి మతిస్థిమితం సరిగాలేదని, ఆమె ఈనెల 25వ తేదీ సాయంత్రం నుంచి అదృశ్యమైనట్లు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9121100530కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ముగిసిన యంత్ర 2కే25

● 500 మంది విద్యార్థులు హాజరు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన యంత్ర 2కే25 ఆదివారం ముగిసింది. ఈ మూడు రోజుల పాటు నెక్స్ట్ జనరేషన్ రోబోటిక్స్ విత్ ఏఐ అండ్ నోడ్ ఎంసీయూ మరియు ఆటోడెస్క్ ఫ్యూజన్ 360 విత్ 3డీ ప్రింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 500మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ పోటీలలో పేపర్ ప్రజెంటేషన్స్, ప్రాజెక్టు వర్క్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన స్టెల్లాంటిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ పి.శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన అర్థరోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి హర్షవర్ధన్, విశాఖపట్టణం పోర్ట్ అథారిటీ అసిస్టెంట్ సెక్రటరీ వి.అజయ్‌తేజ, కళాశాల మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యంత్ర 2కే25లో తయారు చేసిన ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

కోదండరాముడి భక్తులకు మౌలిక వసతులు అందేనా?



ఒంటిమిట్ట కోదండ రామాలయం

● నిపుణుల కమిటీ ప్రణాళికలు సిద్ధమయ్యేనా?.. ● పనులు ప్రారంభం అయ్యేనా?

ఒంటిమిట్ట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాష్ట్రం విడిపోవంతో 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒంటిమిట్ట కోదండరామునికి ప్రభుత్వం తరపున ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 2015 ఆలయ అభివృద్ధి కోసం ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని టీటీడీలో విలీనం చేశారు. టీటీడీ అధికారులు ఆలయ అభివృద్ధి కోసం అప్పట్లో రూ.100 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తూ వస్తున్నారు. కాని భక్తుల మౌలిక వసతుల గురించి పట్టించుకోకపోవడంతో సరైన వసతులు లేక భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాత్రివేళల్లో ఇక్కడ బస చేయాలంటే కష్టంగా ఉందని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళ ఆరుబయటనే నిద్రపోవాల్సి వస్తుండటంతో దోమలు, దొంగలతో భయపడుతున్నారు. దీంతో భక్తులు రాత్రివేళ ఇక్కడ బస చేయకుండా వెళ్లిపోతున్నారు. ఈ యేడాది సీతారాముల కల్యాణం ఉత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేశారు. కల్యాణం అనంతరం టీటీడీ అధికారులతో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు నిపుణుల కమిటీతో ప్రణాళికలు తయారు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు కొద్దిరోజుల క్రితం నిపుణుల కమిటీ ఒంటిమిట్టకు వచ్చి ఆలయ మాడవీధులు, రథశాల, పుష్కరిణి, సంజీవరాయస్వామి ఆలయం, మాల ఓబన్న స్థూపం, శృంగిశైలం, సత్రపాలెం, కొండరామ లక్ష్మణ తీర్థాలు, కల్యాణవేదిక ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలి, ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి అన్న విషయంపై చర్చించుకున్నారు.

గుర్తించిన పనుల వివరాలు..

భక్తులకు ఆహ్లాదపరిచేలా శిల్పారామం, పక్షుల పార్కు, ఔషధ ఆయుర్వేద ఉద్యానవనాల ఏర్పాటు, మాడవీధుల విస్తరణ, ఒంటిమిట్ట చెరువు అభివృద్ధి సుందీకరణ, వావిలకొలను సుబ్బారావు ధ్యానమందిరాన్ని కొత్తగా నిర్మించడం, శృంగిశైలం చుట్టూ గిరిప్రదక్షిణ కోసం రహదారి, ఆలయ సమీపంలోని నాగేటి తిప్పసత్రపాలెం, కొండగుట్టలకు హరిత శోభ తెచ్చేలా మొక్కల పెంపకం, కల్యాణవేదిక వద్ద శిల్పాల ఏర్పాటు, మాల ఓబన్న మండపం, యాత్రికులు విడిది చేయడానికి అనువైన గదులు, శుభ కార్యాలయాలకు కల్యాణమండపం, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక తదితర పనులను నిపుణుల కమిటీ గుర్తించినట్లు తెలిసింది. కాని ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. నిపుణుల కమిటీ ప్రణాళికలు సిద్ధం చేశాయా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సిద్ధమై ఉంటే పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని రామభక్తులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.



ఒంటిమిట్టలోని మాల ఓబన్న స్థూపం



శృంగిశైలి పర్వతం

జాతీయ స్థాయిలో ప్రభావితమైంది..



ఒంటిమిట్ట కోదండరామాలయం ఈనాడు రాష్ట్రస్థాయిని దాటి జాతీయ స్థాయిని కూడా అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో ప్రభావితమైంది. తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకవర్గం, రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ పసుపులేటి శంకర్, పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు, ఒంటిమిట్ట

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి..



ఒంటిమిట్ట కోదండరామ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి. వసతులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి.

- సోమిశెట్టి మనోహర్‌బాబు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు, ఒంటిమిట్ట

శక్తివంత సందేశాన్ని తీసుకెళ్లేందుకే శాంతి ర్యాలీ

● యూఎస్‌వో సెక్రటరీ జనరల్ నీనా జైన్ ● పులివెందులలో ఆకట్టుకున్న పీస్ ర్యాలీ



పీస్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



ర్యాలీలో ఆయా రాష్ట్రాల సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య ఆధారంగా శక్తివంతమైన సందేశాన్ని తీసుకెళ్లడమే శాంతి ర్యాలీ ఉద్దేశమని యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్‌వో) సెక్రటరీ జనరల్ నీనా జైన్ అన్నారు. పులివెందులలో యూఎస్‌వో ఆధ్వర్యంలో ఆలిండియా స్కూల్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్‌లో ఈ ర్యాలీని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీనా జైన్ మాట్లాడుతూ భారతదేశంలో తమ సంస్థ 75ఏళ్లుగా విద్య గొప్పదనం, సంస్కృతి, సంప్రదాయలను వివరిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఒక్కచోటకు చేరడంతో వారివారి సంస్కృతి, సంప్రదాయాలను ఒకరికొకరు తెలుసుకుంటారన్నారు. గౌరవం, శాంతి, సహనం వంటి ఇతర విలువైన ఆలోచనలు కనుగొంటారన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యతో పాటు విలువైన ఆలోచనలతో అదనపు విద్య తెలుసుకుంటారన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, సంస్థ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుప్రకాష్ మాట్లాడుతూ జాతికి ఉపయోగపడేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా యూఎస్‌వో పనిచేయడం అభినందనీయమన్నారు. పులివెందులలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం వుయ్ వాంట్ గ్లోబల్ పీస్ అంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మాన్ని పాటించడమే మానవత



వితరణ చేసిన సామగ్రితో మానవత సంస్థ సభ్యులు

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపనిషత్తులు, వేదాల సారాంశం మనిషి తన ధర్మాన్ని పాటించడమే మానవత్వమని మానవతా సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆదివారం ఉదయం మానవతా సంస్థ నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది జీవరాసుల ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దాతలు పోతుల వెంకటరామిరెడ్డి తన భార్యజ్ఞాపకార్థం శాంతిరథం, మోపూరి భాస్కర్‌రెడ్డి, మోపూరి రామకృష్ణారెడ్డి సోదరులు ఒక బాడీఫ్రీజర్, అమెరికాలో ఉన్న సొంటం విశ్వనాథరెడ్డి ఒక బాడీఫ్రీజర్ వితరణగా ఇచ్చారు. వాటిని మానవతా టీం ప్రారంభించింది. కార్యక్రమంలో ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనర్ రవితేజరెడ్డి, సాయి విజ్ఞాన్ స్కూల్ అధినేత భూపతి మైథిలి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం, డైరెక్టర్లు అవటాల రామంజులరెడ్డి, రాటాల గోపి, భూపతిరాయల్, పప్పనబోయిన సుబ్బరాయుడు, సమ్మెట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖలో మెరుగైన సేవలకు కృషి

సీకేదిన్నె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఉపరవాణా శాఖ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎం.వీరరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన పోర్టల్ ద్వారా వివిధ పనుల కోసం దరఖాస్తు చేసుకుని పది నెలలకు మించిన దరఖాస్తులు 279 ఉన్నాయని, అందులో అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నవి 83 మాత్రమేనని, వాటిని అప్రూవల్ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన 196 దరఖాస్తుల డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడం వలన పూర్తి చేయలేకపోతున్నామన్నారు. ఆయా వాహనదారులు పూర్తి డాక్యుమెంట్ల జిరాక్స్‌లను అక్టోబరు 7వ తేదీలోగా అందించాలని సూచించారు. అందించని పక్షం లో వాటిని రద్దు చేస్తామన్నారు.

అనుమానాస్పద వస్తువులు విక్రయిస్తే సమాచారం ఇవ్వండి

పులివెందుల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద వస్తువులు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అర్బన్ సీఐ సీతారామిరెడ్డి గుజిరి నిర్వాహకులకు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని గుజిరి నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ మధ్యకాలంలో పొలాల వద్ద, మోటర్ల వద్ద వైర్లను దొంగలించుకొనిపోతున్న సందర్భంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారరు. ఇలాంటి వారు రాగివైరును అమ్మడానికి వచ్చినపుడు సమాచారం ఇవ్వాలన్నారు.


సమాజానికి అవసరం సూక్తి సుధాలహరి



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి అవసరమైన విలువైన అనేక అంశాలను తన సూక్తిసుధాలహరి పుస్తకం ద్వారా అందించిన రచయిత స్వర్గీయ ఇమాంసాహె బ్ అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు కొనియాడారు. ఇమాంసాహెబ్ రచించిన సూక్తి సుధాలహరి పుస్తకావిష్కరణ సభ ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇమాంసాహెబ్ కుమారులు రమేశ్‌బాబు, రవికుమార్, కుమార్తె పద్మజ పర్యవేక్షణలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఆర్డీవో హాజరై తొలుత సూక్తి సుధాలహరి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూలమల్లికార్జునరెడ్డి, సైకాలజిస్ట్ వల్లూరు బ్రహ్మయ్య, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు, విశ్రాంత అధ్యాపకుడు ఎంసీ వెంకటయ్య, ఇమాంసాహెబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పేదరికం, అస్పృశ్యతలే తన గురువులన్న జాషువా



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నా జీవితం వడగాల్పులైనా నా కవిత్వం వెన్నెల వెలుగు అని, పేదరికం, అస్పృశ్యతలే నా గురువులని గుర్రం జాషువా చాటిచెప్పారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. కవికోకిల గుర్రం జాషువా జయంతిని భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఘనంగా నిర్వహించి ఆయన రచనలపై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సమరసతాస్వరం, జాతీయతా గళం, కవికోకిల గుర్రంజాషువా అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ,ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు సాయిప్రసాద్, పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలకు కృషి

● ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఏపి ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం నగరంలోని ఎన్జీవోల కో-ఆరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటి స్థలాలు రాని 2000మంది సభ్యులకు స్థలాలు కేటాయింపు కోసం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి 300 ఎకరాల భూమిని కూడా చూడడం జరిగిందన్నారు. రాష్ట్ర సంఘం ద్వారా ప్రభుత్వానికి ప్రపోజల్ పంపామని, అందరికీ ఇంటి స్థలాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అంతకుముందు హౌస్‌బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పారదర్శకంగా పాటుపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నిత్యపూజయ్య, డైరెక్టర్లు కంభం చిన్నయ్య, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, బాలమురళి, రాఘవరెడ్డి, నరసింహ, సుబ్బారెడ్డి, శివశంకరయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బీకాం కంప్యూటర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయంలో బీకాం కంప్యూటర్స్ కోర్సులో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం (29వ తేదీ)లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వెబ్ ఆప్షన్స్ ఈనెల 29 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఆధునిక బోధన విధానం, పరిశోధన, సెమినార్లు, వర్క్‌షాపులు, 50వేల పుస్తకాల గ్రంథాలయం, వసతి గృహాలు, క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

200 మందికి వైద్య చికిత్సలు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చిలమకూరు ఐసీయల్ కర్మాగారం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200మందికి చికిత్సలు చేశారు. ఐసీయల్ వీపీ సుబ్రమణ్యం, హెచ్ ఆర్‌హెడ్ నాగిరెడ్డి, వైద్యులు రాజశేఖర్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, రామాంజుల రెడ్డి, బాలగు ర్రప్ప, ప్రియాంక, గురుఅభిలాష్, లోకేష్ పాల్గొన్నారు.

శ్రీకరి.. శుభంకరి...

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, శివాలయంలో, వైఎంఆర్ కాలనీలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో, వెంకటేశ్వర్లుపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో , రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాత మార్కెట్‌లోని చెన్నకేశవస్వామి ఆలయంలో మహాలక్ష్మిసమేత చెన్నకేశవస్వామి అలంకారం నిర్వహించారు. ఉత్సవాలు ప్రారంభమై వారం రోజులు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు

జమ్మలమడుగులో: దసరా శరన్నవరాత్ర పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 7వ రోజు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి శ్రీ సంతోషిమాత దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే అంభా భవానీ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్లలోని మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో వాసంబకు బాలాత్రిపురసుందరీదేవి అలంకారం నిర్వహించారు. ఏరువాకగంగమ్మ గాయత్రీదేవి, చౌడేశ్వరీదేవికి శ్రీవనవిహారిణీ దేవి, మహాఅంకమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

పోరుమామిళ్లలో: పోరుమామిళ్లలో ఆదివారం రాత్రి అమ్మవారి ఆలయంలో వారాహిదేవి అలంకారం నిర్వహించారు. ఆర్యవైశ్యులు మహిళలు భక్తులు పూజలు నిర్వహించారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు అమ్మవారిశాలలో ఆదివారం భవానిదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు దసరా ఉత్సవాలును అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

బ్రహ్మంగారిమఠంలో: మండల కేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

దువ్వూరులో: దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారు మీనాక్షిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు మీనాక్షి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈపూరి సత్యనారాయణ, సుబ్రమణ్యం ప్రభాకర్, నాగేంద్ర, శివయ్య కుటుంబీకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొండాపురంలో: మండలంలోని దత్తాపురం పెద్దమ్మగుడిలో 7వరోజు ఆదివారం మహాచండీదేవి అలం కారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బద్వేలుటౌన్‌లో: దేవీశరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో తేటోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారు భక్తులకు జగన్మోహినీదేవి అలంకారంలో దర్శనమివ్వగా, కనక దుర్గాదేవి మహాచండీదేవిగా, మహాలక్ష్మీ దేవి సంతానలక్ష్మిగా, కోదం డరామాల యంలో నరసింహావతా రంలో, భద్రకాళీసమేత వీర భద్ర స్వామి ఆల యంలో కాళికా మాతాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు.

కాశినాయనలో: దసరా ఉత్సవాలల్లో ఆదివారం నర్సాపు రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో అమ్మ వారు బాల త్రిపురాసుం ద రీదేగా భక్తులకు దర్శనమి చ్చారు.

ఖాజీపేటలో: స్థానిక మత్కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో దసరా పండుగను పురష్కరించుకుని అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనిమిచ్చారు. ఈ సందర్భంగా రాత్రి 8 గంటలకు కూచిపూడి, భరతనాట్యం ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా ఆలయకమిటీ ఛైర్మన్ మురళీకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పొద్దుటూరు రతనాల వేంకటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, చౌడేశ్వరీదేవి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



జమ్మలమడుగులో సంతోషిమాతగా కన్యకాపరమేశ్వరి




ఎర్రగుంటలో బాలా త్రిపురాసుందరీదవిగా వాసవాంబ




ఎర్రగుంటలో గాయత్రీదేవిగా ఏరువాకగంగమ్మ



దువ్వూరులో మీనాక్షిదేవిగా అమ్మవారు




ఖాజీపేటలో బాలత్రిపురసుందరీగా అమ్మవారు



పోరుమామిళ్లలో వారాహిదేవి



కాశినాయనలో త్రిపురాసుందరీదేవి



మైదుకూరులో భవానిదేవి

ఇంటర్న్‌షిప్ శిక్షణ విద్యార్థులకు చక్కని తోడ్పాటు

బద్వేలు, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులను పురస్కరిం చుకుని బాలుర ఉన్నత పాఠశాల లో 10వ తరగతి ఒకేషనల్ విద్యా ర్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ చక్కని తోడ్పాటునిస్తుందని జిల్లా ఒకేషనల్ విభాగం అధికారిణి దార్ల రూత్ ఆరోగ్య మేరి పేర్కొన్నారు. ఈ కార్య క్రమాన్ని ఆదివారం జిల్లా ఒకేషన ల్ విభాగం అధికారిణి పరిశీలించి విద్యార్థులను ప్రోత్సహించారు. ఇందులో భాగంగా పలువురు విద్యార్థులు ఆటోమైబైల్ షోరూమ్‌లలో పొందే శిక్షణను ఆమె గుర్తించారు. విద్యార్థులకు ఇలాంటి శిక్షణ చదువుతోపాటు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమం విజయవంతమయ్యేం దుకు సహకరించిన ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ట్రైనర్ అక్షయ్‌కుమార్, ఐటీ ట్రేడ్ నుంచి వాసుదేవరెడ్డి, ఎలక్ట్రానిక్స్ నుంచి సునీత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

మందార్ ఫుడ్ హౌస్ ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకనగర్ ఆర్ట్సకాలేజీ రోడ్డులో గబ్బిరెడ్డి జితేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మందార్ టిఫిన్ హౌస్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు శుచి, రుచికరమైన ఆహారం కోసం టిఫిన్ హౌస్‌ను, వెజ్ హౌస్‌ను, ఫామిలి రెస్టారెంట్‌ను, స్కైబార్ ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా టిఫిన్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్‌ముక్తియార్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ వడ్డిబాలుడు, ఈశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంధార్ ఫుడ్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

కార్పెంటర్ల అభ్యున్నతికి కృషి చేస్తాం

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ భారంగా మారుతున్న నేపథ్యంలో కార్పెంటర్ల అభ్యున్నతికి కృషి చేస్తామని వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కొర్రపాటి వీరాంజనేయ ఆచారి, కార్యదర్శి తప్పెట నరసింహచారి పేర్కొన్నారు. ఆదివారం గోపవరం పంచాయతీలోని దువ్వూరు బైపాస్ రోడ్డులో ఉన్న డోర్ డిజైనింగ్ వర్క్‌షాప్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ కార్పెంటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా కొర్రపాటి వీరాంజనేయఆచారి, ప్రధాన కార్యదర్శిగా తప్పెట నరసింహులు, కోశాధికారిగా షేక్ చాంద్‌బాష, ఉపాధ్యక్షులుగా విష్ణు, సర్దార్, సిరిగిరెడ్డి హుస్సేన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా వై.ఖలందర్, కె.ప్రతాప్, ఉపకోశాధికారులుగా ఎస్.మస్తాన్‌వలి, బి.చంద్ర, గౌరవసలహాదారులుగా ఇ.శ్రీనివాసచారి, మహమ్మద్‌అలీ, ఎన్.శేషు, సంయుక్త కార్యదర్శిగా ఉదయ్‌కుమార్, నీలకంఠాచారి మీడియా కన్వీనర్లుగా వి.ప్రసాదాచారి, నరేష్‌ఆచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నూతనంగా ఎంపికైన కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

జూదరుల అరెస్టు - రూ.42,500 నగదు స్వాధీనం

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం చౌటపల్లె గ్రామ పరిధిలో జూదం ఆడుతున్న పది మందిని రూరల్ ఎస్ఐ అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 42,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు కాబడిన 10 మంది జూదరులలో వైసీపీకి చెందిన ఇల్లూరు గ్రామ సర్పంచ్ దస్తగిరి రెడ్డి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వం పెయింటర్ల సంక్షేమానికి కృషి చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెయింటర్ల సంక్షేమానికి కృషి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యేసోబులు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రొద్దుటూరు పెయింటర్స్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ పెయింటర్ల పరిస్థితి ప్రభుత్వాల నిర్లక్ష్యంతో దయనీయంగా మారిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణ, జాయింట్ సెక్రటరి బాష, వర్కింగ్ ప్రెసిండెంట్ సుబ్బరాయుడు, కోశాధికారి సాంబయ్య, వరప్రసాద్, మదన్, సిరాజుద్దీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని మోరగుడి, గూడెం చెరువు గ్రామాల్లో ఆదివారం ఐఈసీ ప్రచార రథం ద్వారా హెచ్ఐవీ, డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలకు సంబంధించి అగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందాలన్నారు.

మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్‌కు ఘన సన్మానం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్‌గా నియమితులైన పట్నం లక్ష్మణ్‌కుమార్‌ను అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం సంఘం కార్యాలయంలో టీడీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఆయనకు దుశ్శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ పట్నం లక్ష్మణ్‌కుమార్ పార్టీ పటిష్టతకోసం చేసిన కృషిని గుర్తించి ఆయనను పదవిలో నియమించారన్నారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణమ్మ ఒడిలో చదువులతల్లి

● నేడు మూలానక్షత్రం అక్షరాభ్యాసం, ప్రత్యేకపూజలు

కొండాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఒడిలో చదువులతల్లి సేదతీరుతోంది. గండికోట బ్యాక్‌వాటర్‌లో చదువులమ్మ ఆలయం ముంపునకు గురైనప్పటికీ, కృష్ణా జలాల్లో పూజలందుకుంటోంది. వివరాల్లోకి వెళితే పవిత్ర చిత్రావతి నది తీరాన కొండాపురం సమీపంలో వెలసిన సరస్వతీదేవి ఆలయం చుట్టూ ప్రస్తుతం గండికోట బ్యాక్ వాటర్ చేరడంతో చుట్టూ మట్టికట్టలు వేసి నీటిలో ఆలయం మునిగిపోకుండా మాజీ సర్పంచ్ పి.విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో అరుదైన సరస్వతీదేవి ఆలయం

జిల్లాలో అరుదైన సరస్వతీదేవి ఆలయాల్లో కొండాపురం ఒకటి. కొండా పురం పట్టణానికి చెందిన దివంగత మాజీ ఎమ్మెల్యే సీఎం రామనాథరెడ్డి దంపతులు పవిత్ర చిత్రావతి నది తీరాన పూజ్య గురువులు నిర్విషయానంద స్వామి ప్రేరణతో ఈ ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో పాలరాతి విగ్రహంతో నిర్మించిన సరస్వతీదేవి అమ్మవారి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. . దేవి నవరాత్రుల్లో వచ్చే మూలా నక్షత్రం, మాఘమాసంలో వచ్చే వసంతపంచమిలు అమ్మ వారికి ప్రత్యేక రోజులు. ఈ రోజుల్లో జిల్లా నుంచే కాక పొరుగు జిల్లాల నుంచి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించటానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. సోమవారం మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అక్షరాభ్యాసానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వనాథరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 6281938152 సెల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.



గండికోట బ్యాక్‌వాటర్‌లో సరస్వతీదేవి ఆలయం (ఇన్‌సెట్) పాలరాతి విగ్రహంతో అమ్మవారు

నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ సెలూన్ షాపులను వ్యతిరేకిస్తూ బద్వేలు పట్టణంలో ఆదివారం నాయీబ్రాహ్మణులు తమ దుకాణాలను మూసివేసి న్యాయం చేయాలంటూ నాలుగు ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు అనేక మంది కుటుంబాలు క్షౌరశాలలనే నమ్ముకొని జీవిస్తున్నామన్నారు. ఇప్పుడు బద్వేలు పట్టణంలో కార్పొరేట్ సెలూన్‌లను ఏర్పాటు చేయడం వల్ల తాము జీవనోపాధిని కోల్పోతున్నామన్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా నాయకులు స్పందించి నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్, మాడపూరు బ్రహ్మయ్య, వడ్డమాను గురుబ్రహ్మం, గురుస్వామి, సిద్దయ్య, వెంకటసుబ్బయ్య, గురు మోహన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయం చేయాలంటూ ర్యాలీ చేస్తున్న నాయీబ్రాహ్మణులు

మానవతా నూతన కమిటీ ఏర్పాటు

ఖాజీపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కమిటీని సంస్థ ఫౌండర్ రామచంద్రారెడ్డి ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు రెడ్యం సుబ్బారెడ్డి తోపాటు కమిటీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమానురాగాలతో జీవితం సుఖ సంతోషంగా గడపాలన్నారు. కమిటీకి ఖాజీపేటలో ఈవీ మహేశ్వర్‌రెడ్డి ఫ్రీజర్‌ను ఉచితంగా అందజేశారు. అలాగే పూసలకొట్టాలుకు చెందిన కృష్ణయ్య రూ.70 వేలు నగదును అందజేయడం జరిగిందని, ఈ ఫ్రీజర్‌ను మండల ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాదనాగేశ్వర ఛైర్మన్ ఆదినారాయణరెడ్డి, రావులపల్లె ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, పీవీ జయచంద్రారెడ్డి, మెకానిక్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

కలసపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండల కేంద్రంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేలు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.